క్లుప్తంగా

నీటి ఎద్దడి నివారణకు చర్యలు



కొత్తకైరవాడిలో బోరు వేస్తున్న దృశ్యం

నందవరం: వేసవి దృష్ట్యా గ్రామాల్లో నీటి ఎద్దడి నివారణ చర్లల్యో భాగంగా ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు చర్యలు చేపట్టారు. కొత్తగా బోర్ల ఏర్పాటు, సమ్మర్ స్టోరేజీ ట్యాంకు ద్వారా నీటి సరఫరా చేపట్టారు. మండలంలో కొత్తకైరవాడి గ్రామంలో కొత్తగా బోరు వేయించగా దాదాపు రెండు ఇంచుల నీరు పడింది. త్వరలో మోటార్ బిగించి ఓహెచ్ఎస్ఆర్ ట్యాంకుకు కనెక్షన్ ఇచ్చి గ్రామంలో నీటి సరఫరా చేస్తామని అధికారులు చెబుతున్నారు. అలాగే హాలహర్వి గ్రామం వద్ద ఉన్న సమ్మర్ స్టోరేజ్ ట్యాంకులో నీరు సమృద్ధిగా ఉందని, ఓవర్‌హెడ్ ట్యాంకుకు పంపింగ్ చేసి ఇంటింటికీ సరఫరా చేస్తామని అధికారులు వెల్లడించారు.

నవోదయ ప్రవేశ పరీక్షలో ప్రతిభ




విద్యార్థి ఎస్.హర్షవర్ధన్ గొల్ల చరిత

దేవనకొండ: దేశంలో అత్యున్నత విద్యాసంస్థలుగా పేరుగాంచిన నవోదయ స్కూల్ సీటు పొందడం అంత ఆషామాషీ కాదు. ఈ యేడాది జనవరి 20వ తేదీన జరిగిన నవోదయ ప్రవేశ పరీక్ష ఫలితాలు ఆదివారం విడుదలయ్యాయి. ఈ ఫలితాల్లో దేవనకొండకు చెందిన ఇద్దరు విద్యార్థులు మంచి మార్కులు సాధించి సీటు సాధించారు. దేవనకొండకు చెందిన ఎస్.హర్షవర్ధన్ (సన్నాఫ్ నాగరాజు), గొల్ల చరిత (డాటర్ ఆఫ్ రమేష్) మంచి మార్కులు సాధించి సీటు సాధించారు. దీంతో పాఠశాల యాజమాన్యం, తల్లిదండ్రులు, గ్రామస్తులు విద్యార్థులను అభినందించారు.

సిద్దేశ్వరుడిని తాకిన సూర్య కిరణాలు



గర్భగుడిలో విరాట్‌మూర్తిపై సూర్య కిరణాలు

హొళగుంద: మండల కేంద్రంలో వెలసిన సిద్ధేశ్వరస్వామి ఆలయ గర్భగుడిలో విరాటమూర్తిని ఆదివారం సూర్యకిరణాలు తాకాయి. సాధారణ రోజుల్లో కిరణాలు గుడి బయట వరకు పడుతున్నా ఈ తేదీల్లో మాత్రం ఆలయం శిఖరం నుంచి గర్భగుడిలో ప్రవేశించి స్వామి విరాటమూర్తులను తాకుతాయి. ఎప్పుడు చీకటిగా ఉండే గర్భగుడిలో సూర్య కిరణాలు లోపలి వరకు వెళ్లి స్వామిని తాకడం ఆశ్చర్యంగా ఉందని గ్రామస్తులు తెలిపారు. సూర్య కిరణాలు విరాటమూర్తిని తాకడం శుభ సూచకమని భక్తులు అంటున్నారు. భక్తులు స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

గడ్డివాములు దగ్ధం



మంటలను అదుపు చేస్తున్న అగ్నిమాపక సిబ్బంది

చిప్పగిరి: మండలంలోని బెల్డోణ గ్రామంలో ప్రమాదవశాత్తు నిప్పంటుకుని నాలుగు గడ్డివాములు దగ్ధమయ్యాయి. వివరాలు.. గ్రామానికి చెందిన గొల్ల రాముడు, కోనంకి వెంకటేష్ అనే రైతులకు చెందిన గడ్డి వాములకు నిప్పంటుకుని మంటలు వ్యాపించాయి. స్థానికులు వెంటనే అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇచ్చారు. వారు వచ్చి మంటలను అదుపు చేశారు. ఈలోపు గడ్డివాములు పూర్తిగా కాలిపోవడంతో రూ.2.5 లక్షల నష్టం వాటిల్లినట్లు బాధితులు వాపోయారు. మంటల్లో చిక్కుకున్న ట్రాక్టర్‌ను బయటకు తెచ్చేందుకు ప్రయత్నించిన తిప్పయ్య, రాంబాబుకు గాయాలు కావడంతో గుంతకల్లులోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు.

గ్రామాల్లో జవాన్ల కవాతు



హోసూరులో కవాతు నిర్వహిస్తున్న జవాన్లు

పత్తికొండ రూరల్: మండల పరిధిలోని సమస్యాత్మక గ్రామాలైన హోసూరు, అటికెలగుండు గ్రామాల్లో ఆదివారం సీఐ మురళీమోహన్ ఆధ్వర్యంలో సీఆర్‌పీఎఫ్ జవాన్లు కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ప్రశాంత వాతావరణంలో ప్రతిఒక్కరూ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలన్నారు. గ్రామాల్లో శాంతిభద్రతలకు భంగం కలిగిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

రైతు సంక్షేమానికి పెద్దపీట

- నిత్యం వెన్ను దన్నుగా నిలుస్తున్న రాష్ట్ర ప్రభుత్వం
- ఆర్బీకేల ఏర్పాటుతో గ్రామంలోనే అందుబాటులో సేవలు
- నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, పురుగు మందుల సరఫరా
- రైతన్నలకు తప్పిన వ్యయప్రయాసలు
- పంట దిగుబడులు నిల్వచేసుకునేందుకు గోడౌన్ల నిర్మాణం
- హర్షం వ్యక్తం చేస్తున్న అన్నదాతలు



రైతులకు సబ్సిడీ శనగ విత్తనాలు పంపిణీ చేస్తున్న అధికారులు (ఫైల్)

చిప్పగిరి: రైతే రాజు అనే నానుడిని నిజం చేస్తూ అన్నదాతల సంక్షేమానికి అనేక పథకాలు అమలు చేస్తూ ముఖ్యమంతి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం 58 నెలలుగా రైతాంగం నుంచి నీరాజనాలు అందుకుంటోంది. ప్రభుత్వం తీసుకుంటున్న ప్రత్యేక చర్యలతో రైతన్నకు తిప్పలు తప్పాయి. గత ప్రభుత్వాల పాలనలో రైతుల ఆత్మహత్యలు, రైతు కూలీల వలసలు, వ్యవసాయం అంటే ఆమడ దూరం పరుగెత్తే దయనీయ స్థితిలో రైతాంగం మగ్గుతూ వచ్చింది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అధికారం చేపట్టిన నాటి నుంచి రైతుల తలరాతలు మర్చేలా పథకాలు అమలుచేస్తూ వ్యవసాయాన్ని పండుగ చేశారు. విత్తనం వేసేందుకు సబ్సిడీపై విత్తనాల పంపిణీ మొదలుకుని పంట దిగుబడులు మద్దతు ధరకు అమ్ముకునే వరకు నిత్యం రైతుకు తోడు నీడగా నిలుస్తున్నారు.

మండలంలో వైఎస్సార్‌సీపీ పాలనలో రైతులకు అందించిన సంక్షేమ పథకాలు

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం వివిధ సంక్షేమ పథకాల ద్వారా చిప్పగిరి మండలంలో రైతులకు అందించిన మొత్తం రూ.26.7 కోట్లు.

- సబ్సిడీ విత్తనాల ద్వారా 11,763 మంది రైతులకు రూ.5,26,67,140 ఆర్థిక తోడ్పాటు
- వైఎస్సార్ రైతు భరోసా ద్వారా 7,819 మంది రైతులకు రూ.10,55,56,500 అందింది
- పంటనష్ట పరిహారం ద్వారా 8172 మంది రైతులకు రూ.9,52,89,650 లబ్ది చేకూరింది.
- వైఎస్సార్ యంత్రసేవ ద్వారా మండలంలోని 9 ఆర్బీకేల పరిధిలోని సీహెచ్‌సీ సెంటర్లకు రూ.1,35,00,000 విలువ చేసే వివిధ యంత్ర పరికరాలను రైతులకు అందించారు.



గుమ్మనూరు గ్రామంలో రూ.44 లక్షలతో నిర్మించిన గోడౌన్

- రూ.1.62 కోట్లతో 9 రైతు భరోసా కేంద్రాల నిర్మాణాలు చేపట్టగా 3 భవనాలు పూర్తయ్యాయి. 6 భవనాల నిర్మాణాలు వివిధ దశలలో సాగుతున్నాయి.
- రూ.3.96 కోట్లతో నిర్మించిన 9 మల్టీపర్పస్ గోడౌన్లు గ్రామ సచివాలయాల పరిధిలో అందుబాటులో ఉన్నాయి.

వీటికి తోడు రైతులకు అనేక సంక్షేమ పథకాలు అందించడంపై రైతాంగం నుంచి హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి.



చిప్పగిరిలో నిర్మించిన రైతు భరోసా కేంద్రం

పెట్టుబడి సాయం అందిస్తున్నారు



ప్రభుత్వం అందిస్తున్న రైతు భరోసా సాయంతో వ్యవసాయ సీజన్ ప్రారంభంలో పెట్టుబడుల కోసం ప్రైవేటు వడ్డీ వ్యాపారులను ఆశ్రయించాల్సిన అవస్థలు తప్పాయి. ఎలాంటి అప్పు చేయకుండా పంటల సాగుకు పెట్టుబడి పెడుతున్నాం. వచ్చిన దిగుబడితో ఆర్థికంగా ఎదుగుతున్నాం. రైతు సంక్షేమం కోసం ఈ స్థాయిలో తపించే ముఖ్యమంత్రిని మునుపెన్నడూ చూడలేదు. ప్రకృతి వైపరీత్యాలు సంభవిస్తే సీజన్ ముగిసేలోపే పంట నష్ట పరిహారం అందిస్తున్నారు. ముఖ్యమంత్రి అధికారం చేపట్టిన నాటి నుంచి వర్షాలు సమృద్ధిగా కురుస్తూ పంటలు బాగా పండుతున్నాయి. రైతు సంక్షేమానికి కృషి చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డికి రుణపడి ఉంటాం.

– లింగప్ప, రైతు, నంచర్ల గ్రామం

దేవరగట్టులో ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో మాళ మల్లేశ్వరస్వామి

హొళగుంద: బన్ని ఉత్సవాలకు ప్రసిద్ధి చెందిన దేవరగట్టులో ఆదివారం స్వామివారాన్ని పురస్కరించుకుని మాళ మల్లేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు జరిగాయి. ఈ సందర్భంగా పూజారులు ఆలయంలోని మూలవిరాట్‌లకు సుప్రభాత సేవ, అభిషేకాలు, రుద్రాభిషేకం, బండరార్చన, కుంకుమార్చన, మహామంగళారతి, నైవేద్య సంతర్పణతో పాటు ఇతర ప్రత్యేక పూజలను శాస్త్రోక్తంగా నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు. స్వామివారిని దర్శించుకోవడానికి వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చారు. ఈ సందర్భంగా భక్తులకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో నిర్వాహకులు అన్నదానం చేశారు.

కవికి సన్మానం

ఆలూరు రూరల్: కన్నడ సాహిత్య పరిషత్, ఆంధ్రప్రదేశ్ గడినాడ సంఘం ఆధ్వర్యంలో మండలంలోని కమ్మరచేడు గ్రామానికి చెందిన యువ కవి ఎం.రాజశేఖర్‌ను ఘనంగా సన్మానించారు. ఆదివారం శ్రీ సత్యసాయి జిల్లా హిందూపురంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన 8వ కన్నడ సాహిత్య కవి సమ్మేళనంలో ఆ సంఘం అధ్యక్షులు అంజన్ కుమార్, కవి సమ్మేళన సభ అధ్యక్షుడు డాక్టర్ శివన్న శాలువా కప్పి జ్ఞాపికను అందజేశారు. తీరని కష్టాలు అనే అంశంపై తనదైన శైలిలో రచనలు చేసినందుగాను ఆయన్ను సత్కరించారు. తోటి కవులు రాజశేఖర్‌కు అభినందనలు తెలిపారు.

పేదలకు మేలు చేసిన వైఎస్సార్‌సీపీ

- చంద్రబాబుకు దళితులు, పేదల పట్ల చులకన భావం
- టీడీపీకి వలంటీర్ల భయం
- సీఎం జగనన్న బస్సు యాత్ర విజయవంతంపై కృతజ్ఞతలు తెలిపిన ఎమ్మెల్యే
- నేటి నుంచి వెల్దుర్తి మండలంలో ఎమ్మెల్యే ఇంటింటి ప్రచారం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి

వెల్దుర్తి(కృష్ణగిరి): అన్ని వర్గాలలోని పేదలకు సంక్షేమ పథకాలు అందించడంతోపాటు, వారికి అన్ని చోట్ల 50 శాతం రిజర్వేషన్ అమలుతో సామాజిక న్యాయం చేసి సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పేదల అభ్యున్నతికి పెద్దపీట వేశారని పత్తికొండ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి అన్నారు. ఆమె ఆదివారం వెల్దుర్తి మండలంలోని చెరుకులపాడులోని స్వగృహంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. శింగనమల నియోజకవర్గానికి వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా ప్రకటించిన రామాంజనేయులును టీడీపీ అధినేత చంద్రబాబు హేళనగా మాట్లాడడం తగదన్నారు. దళితుడైన టిప్పర్ డ్రైవర్ ఏం చేస్తాడంటూ మాట్లాడడాన్ని ప్రజలందరూ గమనించారని ఓటుతో బుద్ధి చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. సొంత కష్టంతో టిప్పర్ నడుపుకుంటూ ప్రజా సేవలో ముందున్న వ్యక్తికి సీఎం జగనన్న ఎమ్మెల్యే అభ్యర్థిగా అవకాశమివ్వడం, పేదలు అసెంబ్లీలో కూర్చుంటారన్నది చంద్రబాబు జీర్ణించుకోలేక పోతున్నాడన్నారు. నాలుగున్నరేళ్లుగా క్షేత్రస్థాయిలో నిస్వార్థంగా సేవ చేస్తున్న వలంటీర్లను చూసి కూడా చంద్రబాబు భయపడిపోతున్నాడని, కుట్రలతో వృద్ధులు, వ్యాధిగ్రస్తులు, నిరాశ్రయులకు అందించే పింఛన్ల పంపిణీని కూడా అడ్డుకున్నారని విమర్శించారు. దళితులు, బీసీలు, పేదలంటే పల్లకీ మోసే వారిగా టీడీపీ భావిస్తోందని, ప్రస్తుత ఎన్నికల్లో వారే ఆ పార్టీకి తగిన బుద్ధి చెబుతారన్నారు. శనివారం నాటి సీఎం జగన్ కర్నూలు జిల్లా, పత్తికొండ పరిధిలోని బస్సు యాత్ర విజయవంతం కావడం పట్ల ప్రజలు, అభిమానులు, నాయకులు, కార్యకర్తలకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు. 1వ తేదీ నుంచి వెల్దుర్తి మండలంలో తన ప్రచారం ప్రారంభించనున్నట్లు చెప్పారు. తొలి రోజు ఉదయం బుక్కాపురం, కృష్ణాపురం, సాయంత్రం రామళ్లకోట, 2వ తేదీ ఉదయం సర్పరాజాపురం, నర్సాపురం, బోయనపల్లె, సాయంత్రం కలుగొట్ల, 3వ తేదీ ఉదయం రత్నపల్లె, యాదరాళ్ల, సాయంత్రం పుల్లగుమ్మి గ్రామాల్లో ఇంటింటి ప్రచారం నిర్వహించనున్నట్లు తెలిపారు. మే 13న జరగనున్న ఎన్నికల్లో రెండు ఈవీఎంలలో ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని ప్రజలను విన్నవించారు. కృష్ణగిరి ఎంపీపీ డాక్టర్ కంగాటి వెంకట్రామిరెడ్డి, పార్టీ వెల్దుర్తి మండలాధ్యక్షుడు బొమ్మన రవిరెడ్డి, కొత్తూరు వెంకటేశ్వరరెడ్డి, రెండు మండలాల నాయకులు పాల్గొన్నారు.

పేదలంటే చులకనా బాబూ..



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ ఆలూరు ఎమ్మెల్యే అభ్యర్థి బుసినె విరూపాక్షి

ఆలూరు: వైఎస్సార్‌సీపీ అధినేత సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి అట్టడుగు వర్గాలకు చెందిన వారిని పార్టీ తరపున ఎమ్మెల్యే అభ్యర్థులుగా ప్రకటిస్తే వారి వ్యక్తిత్వాన్ని కించపరచేలా టీడీపీ అధినేత మాజీ సీఎం చంద్రబాబునాయుడు ఇష్టానుసారంగా మాట్లాడడం దారుణం అని పార్టీ ఆలూరు ఎమ్మెల్యే అభ్యర్థి బుసినె విరూపాక్షి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆయన ఆదివారం చిప్పగిరిలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. అనంతపురం జిల్లా సింగనమల నియోజకవర్గం ఎమ్మెల్యే అభ్యర్థిగా దళిత కుటుంబానికి చెందిన టిప్పర్ డ్రైవర్ వీరాంజనేయులును పార్టీ అధిష్టానం ప్రకటించిందన్నారు. దీన్ని ఓర్వలేని చంద్రబాబునాయుడు పేదల వ్యక్తిత్వాన్ని, డ్రైవర్ వృత్తిని కించపరిచేలా వ్యాఖ్యలు చేయడం తగదన్నారు. చంద్రబాబు పెత్తందారి పోకడలకు బుద్ధిచెప్పి రాజకీయంగా సమాధి కట్టేందుకు పేదలు సిద్ధంగా ఉన్నారని స్పష్టం చేశారు. వివిధ మండలాల నాయకులు, కార్యకర్తలు, తదితరులు ఉన్నారు. అంతకుముందు ఈస్టర్ సందర్భంగా క్రైస్తవ మతస్తులకు ప్రత్యేక శుభాకాంక్షలు తెలిపారు.



విరూపాక్షిని సన్మానిస్తున్న ముస్లిం పెద్దలు

ముస్లింల అభ్యున్నతికి కృషి

హొళగుంద: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ముస్లింల అభ్యున్నతికి పెద్దపీట వేసిందని ఆ పార్టీ ఆలూరు ఎమ్మెల్యే అభ్యర్థి బుసినె విరూపాక్షి అన్నారు. ఆదివారం రాత్రి హొళగుందలోని చిన్న మసీదులో ప్రత్యేక ప్రార్థనలో పాల్గొన్న ఆయన భోళే బాషా ఇచ్చిన ఇఫ్తార్ విందులో పాల్గొన్నారు. ముస్లిం సోదరులకు రంజాన్ నెల సందర్భంగా పండుగ శుభాకాంక్షలు తెలిపారు. విరూపాక్షి మాట్లాడుతూ.. ముస్లిం మైనార్టీల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ఈద్గాకు కాంపౌండ్ వాల్, పట్టా మంజూరుకు కృషి చేస్తానని హామీఇచ్చారు. ప్రార్థనలో పాల్గొన్న ఆయనకు ముస్లిం పెద్దలు శాలువా కప్పి సన్మానించారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ షఫివుల్లా, నాయకులు ఈశా, కోగిలతోట శేషప్ప, భోళే బాషా, షాలీ షబ్బీర్, మచ్చావలి తదితరులు ఉన్నారు.

సాగునీటి సమస్యపై వైఖరి వెల్లడించాలి

దేవనకొండ: మండలంలో సాగునీటి సమస్య పరిష్కారంపై ప్రధాన రాజకీయ పార్టీల వైఖరి వెల్లడించాలని సీపీఎం జిల్లా నాయకులు వీరశేఖర్ డిమాండ్ చేశారు. ఆదివారం పార్టీ మండల కమిటీ సమావేశం నిర్వహించారు. అనంతరం వీరశేఖర్ మాట్లాడు తూ.. మండలంలో హంద్రీ–నీవా ప్రధాన సాగునీటి వనరుగా ఉందని, 46 వేల ఎకరాలకు సాగునీరు అందాల్సి ఉండగా సక్రమంగా నీరివ్వడంలేదన్నారు. రైతులు తమ అవసరాల రీత్యా కాలువలకు పైపులు వేసి మోటార్ల ద్వారా సాగునీరు సమకూర్చుకుంటున్నారని, పంట కాలువల నిర్మాణంలో ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేస్తూ మండల రైతాంగాన్ని మోసం చేస్తున్నాయని విమర్శించారు. అదేవిధంగా హంద్రీనీవా ప్రధాన కాలువ పనులు ఇంకా పెండింగ్‌లో ఉన్నాయన్నారు. కప్పట్రాళ్ల, కరివేముల, తెర్నెకల్ గ్రామాల మధ్యలో పెండింగ్ పనులు పూర్తి చేయాలని వారు డిమాండ్ చేశారు. పార్టీ మండల కమిటీ సభ్యులు అశోక్, సూరి, మహబూబ్‌బాషా పాల్గొన్నారు.

సమరోత్సాహం నింపిన జగనన్న పర్యటన

- పార్టీ కార్యకర్తల్లో నూతనోత్సాహం
- గత ఎన్నికల్లో 42 వేల పైచిలుకు మెజారిటీతో తిరుగులేని విజయం
- ఎమ్మెల్యే అభ్యర్థిగా కంగాటి శ్రీదేవికి రెండోసారి అవకాశం
- మళ్లీ గెలిపించుకునేందుకు 'మేమంతా సిద్ధం' అంటూ నినదిస్తున్న కార్యకర్తలు

పత్తికొండ రూరల్: పత్తికొండ మీదుగా సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నిర్వహించిన మేమంతా సిద్ధం బస్సు యాత్ర వైఎస్సార్‌సీపీ కార్యకర్తల్లో సమరోత్సాహం నింపింది. 2019 ఎన్నికల్లో పత్తికొండ నుంచి వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా కంగాటి శ్రీదేవి అప్పటి ప్రత్యర్థి టీడీపీ అభ్యర్థి కేఈ శ్యాంబాబుపై తిరుగులేని ఆధిక్యం 42 వేల ఓట్లు పైచిలుకుతో మెజార్టీతో విజయఢంకా మోగించిన సంగతి తెలిసిందే. ఆమెకు మరోసారి అవకావం కల్పిస్తూ ఎమ్మెల్యే అభ్యర్థిగా ఖరారుచేసిన తరువాత పత్తికొండ బైపాస్‌రోడ్డు మీదుగా సాగిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 'మేమంతా సిద్ధం' బస్సు యాత్ర వైఎస్సార్‌సీపీ శ్రేణుల్లో జోష్ మరింతగా పెంచింది. ఎమ్మిగనూరులో బహిరంగ సభ ముగించుకుని బయలుదేరిన జగనన్నకు గ్రామగ్రామాన ప్రజలు బ్రహ్మరథం పట్టారు. శుక్రవారం పత్తికొండలోకి చేరుకునేందుకు రాత్రయినా జగనన్నపై చెక్కుచెదరని అభిమానంతో స్వాగతం పలికారు. శనివారం అదే అభిమానంతో శిబిరం వద్దకు చేరుకుని జననేతను కలిసేందుకు ఆతృతగా ఎదురుచూశారు. తమ అభిమాన నేతను కలిసి ఆత్మీయ కలయికతో ఆనందపడ్డారు. సోషల్ మీడియా వేదికగా తమ ఆనందాన్ని పంచుకున్నారు. అర్హతే ప్రామాణికంగా కుల, మత వర్గ విబేధాలకు తావు లేకుండా ప్రభుత్వ సంక్షేమ పథకాలను పారదర్శకంగా అమలు చేయడంతో పాటు నియోజకవర్గంలో అభివృద్ధికి రాచబాట వేసి ఈ ప్రాంత ప్రజల్లో ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి చెక్కుచెదరని స్థానం సంపాదించుకున్నారు. ఈసారి ఎన్నికల్లో కూడా గతంలో మాదిరిగానే టీడీపీ తరపున ఎమ్మెల్యే అభ్యర్థిగా కేఈ శ్యాంబాబు ఖరారు కావడంతో వీరిద్దరి మధ్యనే పోటీ నెలకొంది. రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో గతంలో కంటే రెట్టింపు స్ఫూర్తితో పనిచేయాలన్న పార్టీ అధినేత ఆదేశాన్ని శిరసావహిస్తూ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి గెలుపుకోసం సైనికుల్లా పనిచేసి రెండోసారి ఎమ్మెల్యేగా గెలిపించుకునేందుకు మేమంతా సిద్ధం అంటూ నాయకులు, కార్యకర్తలు నినదిస్తున్నారు.

పాదయాత్ర భక్తులకు సేవలు




కన్నడ భక్తులకు అన్నదానం చేస్తున్న గ్రామస్తులు, పోనకలదిన్నెలో ఉచితంగా మందుల పంపిణీ

నందవరం: ఉగాది పండుగ పురస్కరించుకుని శ్రీశైల భ్రమరాంబ, మల్లికార్జున స్వామివార్లను దర్శించుకునేందుకు కాలినడకన వెళుతున్న కర్ణాటక, స్థానిక భక్తులకు నందవరం మండలంలో దాతల సహకారంతో అన్నదాన శిబిరం, ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేసి సేవలు అందిస్తున్నారు. మండల కేంద్రంలో వీరశైవ లింగాయతీ సంఘం ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. అలాగే పొనకలదిన్నెలో భక్తులకు అన్నదానం, ఉచిత వైద్య శిబిరం నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఉగాది పండగకు కన్నడ భక్తులు శ్రీశైల భ్రమరాంబిక దేవికి పుట్టింటి చీర, సారెలు తీసుకెళ్లడం ఆనవాయితీగా వస్తోంది. భక్తుల రద్దీ పెరగడంతో ఉచితంగా మందులు, అన్నదానం, తాగునీటి సౌకర్యం చేపట్టారు. మండలంలో జొహరాపురం, నాగలదిన్నె, సోమలగూడూరు తదితర గ్రామాల్లో ఆయా గ్రామాల పెద్దలు శిబిరాలు ఏర్పాటు చేసి సేవలందిస్తున్నారు.

2 నుంచి మారెమ్మవ్వ విగ్రహ ప్రతిష్ఠోత్సవాలు

తుగ్గలి: రొల్లపాడు తండాలో ఈనెల 2వ తేదీ నుంచి వేద పడింతులు బ్రహ్మశ్రీ గుండు వేణుగోపాలశాస్త్రి (బెల్డోణ స్వామి) ఆధ్వర్యంలో మారెమ్మవ్వ విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆదివారం తండావాసులు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నెల 2, 3న ప్రతిష్ఠ పూజలు, హోమాలు, 4న మారెమ్మవ్వ దేవత విగ్రహ, నాగశిల, శిఖర ప్రతిష్ఠ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు.

భక్తిశ్రద్ధలతో ఈస్టర్



కంబాలపాడు చర్చిలో ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవులు

కృష్ణగిరి: మానవాళి పాప పరిహారార్థం ఈ లోకానికి వచ్చిన ప్రభువు సిలువనెక్కి తిరిగి జన్మించిన లోక రక్షకుడని పాస్టర్లు శాంతన్న, ఇశ్రాయిల్, శాంతమూర్తి అన్నారు. మండల పరిధిలోని అన్ని గ్రామాల్లోని చర్చిల్లో ఈస్టర్ వేడుకలను క్రైస్తవులు ఆదివారం ఘనంగా జరుపుకున్నారు. చర్చిల్లో ప్రత్యేక పార్థనలు చేశారు. ఎదుటి వారికి సూక్తులు చెప్పడమే కాకుండా, ఆ బోధనలను ఆచరణలో చూపిన మహోన్నత వ్యక్తి ఏసుక్రీస్తు అన్నారు. మంచితనంతో సన్మార్గంలో నడిచినప్పుడే జీవితానికి సార్థకత ఉంటుందని పాస్టర్లు బోధించారు. ఆయా గ్రామాల సంఘ కాపరులు నారాయణ, మూలింటి మాదన్న తదితరులు పాల్గొన్నారు.

వెల్దుర్తి(కృష్ణగిరి): ఏసు ప్రభువు పునరుత్థాన పండుగ ఈస్టర్‌ను మండలవ్యాప్తంగా క్రైస్తవులు ఘనంగా జరుపుకున్నారు. చర్చిలలో ప్రార్థనలు, కీర్తనలు నిర్వహించారు. మండల కేంద్రంలోని ఏబీఎం చర్చి భక్తులతో కిక్కిరిసింది. రెవరెండ్ సీ ఏసేపు ఆధ్వర్యంలో వీరన్నగట్టు కొండపై ఏర్పాటైన భారీ శిలువ వద్ద ప్రత్యేక పార్థనలు చేశారు. అనంతరం ఏసును కీర్తిస్తూ కొత్తబస్టాండు, పాత బస్టాండు, మెయిన్ బజారు గుండా ర్యాలీ నిర్వహించారు. సంఘ పెద్దలు జెడ్పీటీసీ సుంకన్న, పౌలు, మనోరాజు, రాజారత్నం, తదితరులు పాల్గొన్నారు.

తుగ్గలి: మండలంలో క్రైస్తవులు ఆదివారం ఈస్టర్ వేడుకలను భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఆయా గ్రామాల్లో చర్చిలన్నీ భక్తులతో సందడిగా మారాయి. ప్రత్యేక ప్రార్థనలు, యేసు క్రీస్తు సందేశాలను అందించారు. ప్రార్థనలకు హాజరైన క్రైస్తవులు ఒకరికొకరు పండుగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

ముందు జాగ్రత్తే రక్ష

- పెరిగిన ఉష్ణోగ్రతలు
- పొంచి ఉన్న వడదెబ్బ ప్రమాదం
- జాగ్రత్తలు పాటించాలంటున్న వైద్యులు



ఎండలో పనిచేస్తున్న కూలీలు (ఫైల్), (ఇన్‌సెట్) పీహెచ్‌సీ వైద్యాధికారి న్యూటన్

హొళగుంద: ఎండలు మండుతున్నాయి. కొద్ది రోజులుగా ఉష్ణోగ్రతలు భారీగా పెరుగుతున్నాయి. వేసవిలో జాగ్రత్తలు తీసుకుంటే వడదెబ్బకు గురికాకుండా ఉండవచ్చని హొళగుంద ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి న్యూటన్ అన్నారు. ముఖ్యంగా రైతులు, వ్యవసాయ కూలీలు అప్రమత్తంగా ఉండాలని సూచిస్తున్నారు. వడదెబ్బకు గురికాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి ఆయన మాటల్లోనే.. ఎండ తీవ్రంగా ఉన్నప్పుడు శరీరంలో ఉష్ణోగ్రతను నియంత్రించే కేంద్ర మండల నాడీ వ్యవస్థ దెబ్బతినడంతో వడదెబ్బ వస్తుంది. దీనినే సన్‌స్ట్రోక్ లేదా హీట్ స్ట్రోక్ అని కూడా అంటారు. శరీర ఉష్ణోగ్రత పెరిగి మెదడుపై ప్రభావం చూపుతుంది. తీవ్రస్థాయిలో వడదెబ్బ తగిలితే ప్రాణాలు పోయే ప్రమాదం ఉంది. ఎండలో అధికంగా తిరగడం, అందులో మద్యం, మాంసం, రంగుల పానీయలు తీసుకోవడం, గుట్కాలు నమలడం చేసే వారితో పాటు పొలాల్లో పనిచేసే వారికి ఎక్కువగా వడదెబ్బ తగులుతుంది. ప్రధానంగా వృద్ధులు, చిన్న పిల్లలు త్వరగా వడదెబ్బకు గురౌతారు. అలసట, తలనొప్పి, ఒళ్లు నొప్పులు, అధిక జ్వరం, వాంతులు, విరేచనాలు, కళ్లు తిరగడం, స్పృహ కోల్పోవడం, 105 డిగ్రీల కన్నా ఎక్కువ జ్వరం ఉండడం, మూత్రం రంగు మారడం వీటి లక్షణాలు. ముందుగా తలనొప్పితో పాటు గొంతు తడారుతుంది. అప్పుడే మేల్కొని నీడలోకి చేరి శరీరంలోని వేడిని తగ్గించుకునేలా చర్యలు తీసుకోవాలి.

వడదెబ్బ తగలకుండా పాటించాల్సిన జాగ్రత్తలు

- సాధ్యమైనంత వరకు మధ్యాహ్నం 12 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు బయటకు వెళ్లకపోవడం ఉత్తమం.
- తప్పనిసరిగా బయటకు వెళ్లాల్సిన పరిస్థితుల్లో గొడుగు, తాగునీరు, ఉప్పు కలిపిన మజ్జిగ తీసుకెళ్లాలి.
- వేసవి కాలంలో తెల్లని దుస్తులు లేదా లేతరంగు వస్త్రాలు, టోపీ ధరించాలి.
- మద్యం అలవాటు ఉన్న వారు వాటికి దూరంగా ఉండాలి.
- ఉదయం, సాయంత్రం సమయాల్లో మాత్రమే బయటకు వెళ్లేలా ఏర్పాటు చేసుకోవాలి.

వడదెబ్బ తగిలితే తీసుకోవాల్సిన చర్యలు

- వడదెబ్బ తగిలిన వారిని చల్లటి ప్రాంతంలోకి తీసుకెళ్లాలి.
- పది నిమిషాల తర్వాత కూలర్, ఏసీ ఉన్న గదుల్లో ఉంచాలి.
- షర్ట్ తీసివేసి ఐస్ గడ్డలు లేదా అతిచల్లని నీటితో తడిపిన బట్టతో ఒళ్లు తుడవాలి.
- కొబ్బరి నీళ్లు కానీ చెక్కెర, చిటికెడు ఉప్పు కలిపిన ద్రవనాన్ని తాగించాలి.
- అపస్మారక స్థితిలో ఉన్న వారికి నీళ్లు తాగించకూడదు.
- వీలైనంత త్వరగా ఆస్పత్రికి తరలించాలి.